కల్తీ

ఆరోజు కర్ఫ్యూ లేదు. బంద్ లేదు. ఏరకమైన శలవూ అంతకన్నా లేదు. మార్కెట్టులో షాపులన్నీ మూసేస్తున్నారు. ముఖ్యంగా కిరాణా అంగళ్ళు. స్పీడుగా జీపొచ్చి ఒక షాపుముందు ఆగింది. జీపు లోంచి బిలబిలమని దిగారు ఒక ఆఫీసర్, ఒక సూపర్నెంటు, ఇద్దరు గుమస్తాలు, ఒక ప్యూను. వాళ్ళంతా కడప నుండి వచ్చారు. అప్పటికే అన్ని అంగళ్ళూ మూతపడ్డాయి.

ఆఫీసర్ రెండు చేతులు నడుంమీద వేసుకొని మార్కెట్టు ఈ చివరి నుండి ఆ చివరిదాకా డేగకళ్ళు సాగదీసి మరీ చూశాడు. అన్నీ మూతబడ్డాయి. తల రెండు సార్లు పంకించాడు. జీపెక్కి కూర్చున్నారందరూ! జీపు మున్సిపాల్టీ ముందు ఆగింది. "కమీషనర్ లేడా?" అడిగాడు కడప నుండి వచ్చిన ఆఫీసర్. "కలక్టర్ పిలిస్తే, కర్నూలు మీటింగ్‌కి పొయ్యిండు" అటెండర్ జవాబిచ్చాడు. అల్లంతదూరం నుండే ఉరుక్కుంటూ వస్తున్నాడు అమ్రుద్దీన్. అమ్రుద్దీన్ మున్సిపాల్టీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్. అతణ్ని చూసి పళ్లు పటపట కొరికాడు కడపనుండి వచ్చిన ఆఫీసర్. "ఏమయ్యా! నేను ఏ క్షణాన్నైనా వస్తానని చెప్పానుగదా? వచ్చేటైంకి ఎక్కడికి పొయ్యావయ్యా!"

"ఫ్రైడేగదాసార్? నమాజ్‌కి పోతి. చెకింగ్‌కి పోదాంపద సార్!" అన్నాడు అమ్రుద్దీన్.

"ఏం చెకింగ్! నీ బొంద చెకింగ్! అంగళ్ళన్నీ మూసేశారు. బైదిబై! నేను వస్తున్న విషయం ఎలా లీక్ అయ్యింది? కమాన్ ఆన్సర్ టు మై క్వశ్చన్!"

"నమాజ్ చేసి వస్తున్నా! నేనైతే ఎవ్వరికీ చెప్పలేదు" ఒకింత దీనంగా విన్నవించుకున్నాడు అమ్రుద్దీన్.

"సరే! గతనెలలో ఎన్ని సాంపిల్స్ తీశావో చూయించు" ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రూమ్‌లోకి దారితీశాడు కడప ఆఫీసర్. అమ్రుద్దీన్ రిజిష్టర్లన్నీ చూపించాడు. రిజిష్టర్‌లో అన్నీ సరిగ్గానే ఉన్నాయి. మనుషులు తినే వస్తువులు కల్తీకాకుండా నిరోధించ

దీర్ఘాశి విజయభాస్కర్

డం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ డ్యూటీ. నెలకు నాలుగు శాంపిల్స్ తీసి పరీక్షకు పంపాలి. నాలుగేంఖర్మ అమ్రుద్దీన్ ఎనిమిది పంపించాడు. ఒక్కటి కూడా కల్తీ కాలేదని రిపోర్ట్సు వచ్చాయి. అదే రిజిష్టర్‌లో రికార్డుచేసి చూపించాడు అమ్రుద్దీన్. దాంతో ఒళ్ళు మండిపోయింది కడప ఆఫీసర్‌కి.

"ఎందుకయ్యా మీరు ఉద్యోగాలు చేసేది? ఎనిమిది శాంపిల్స్ తీస్తే ఒక్కటీ (కల్తీ అని) రాలేదా? అంటే శాంపిల్ నువ్వు తీశావా? వాడు ఇచ్చింది నువ్వు తీసుకున్నావా? యూస్‌లెస్ ఫెలో!" రిజిష్టర్ విసిరికొట్టాడు కడప ఆఫీసర్.

అమ్రుద్దీన్ ఏం మాట్లాడలేదు. దాంతో ఆఫీసర్ కోపం రెట్టింపు అయింది. "అంగళ్ళ వాళ్ళతో లాలూచీ అయిపోయి, వాళ్ళేదిస్తే అది టెస్టుకి పంపించేస్తారు. ఎలా వస్తాయి నెగటివ్ రిజల్ట్సు. ఇక్కడ చూస్తే అంతా కల్తీయే. మేం షడెన్‌గా వచ్చి శాంపిల్ తీయాలంటే ముందే లీక్ చేస్తారు. అంగళ్ళన్నీ మూసేశారు. ఎలా? ఏం మాట్లాడవ్?" అమ్రుద్దీన్ మాట్లాడలేదుగానీ పరుగెత్తి పక్కగదిలోకి వెళ్లాడు. తిరిగివచ్చి ఆఫీసర్ చేతులు పట్టుకొని కాస్తదూరంగా తీసుకెళ్ళాడు. పదినిమిషాలు పట్టింది జీపు దగ్గరికి వచ్చేసరికి. జీపు ఎక్కబోతూ కడప ఆఫీసర్ అటు అమ్రుద్దీన్‌తో అన్నట్లు, ఇటు తన బృందానికి చెప్పినట్టు అన్నాడు.

"నవ్వేడేస్ ఉజ్జోగాల్జేయ్యడం కష్టమైపోయింది. మర్చంట్స్ తెలివిమీరిపోయారు. పొలిటికల్ ఇంటర్‌ఫియరెన్స్ ఎక్కువైపోయింది. వస్తానోయ్ అమ్రుద్దీన్! యాజ్‌యూజువల్‌గా నీ పని నువ్వు చేసుకొనిపో. ఎవ్వరికీ బెండ్ కావద్దు. వస్తాను" ఇద్దరూ బయల్దేరారు.

ఆఫీసర్ కడప వైపు- అమ్రుద్దీన్ అంగళ్ళవైపు.

** ** **

ముంతాజ్ బ్యాంకులో క్లర్కు. ఆమె నోట్లన్నీ లెక్కబెట్టి కట్టలుగా చేసి రబ్బరు బ్యాండు వేస్తుంది. బ్యాంకులో కాదు ఇంట్లో. బొగ్గుల కుంపట్లో చీకులు కాల్చుకొని తింటున్నాడు భర్త. అప్పటికే నాలుగు కట్టలకు బేండు వేయడం పూర్తి చేసింది.

"అందులో రెండు పక్కనపెట్టు."

"ఎందుకు?"

"చెప్తా పెట్టు"

"చెబితేనే పెట్టేది"

"మధ్యాహ్నం కడపనుండి వచ్చారుగా! తిమ్మారెడ్డి దగ్గర అప్పు తీసుకొని ఇచ్చాను. ఒక బండిల్ తిమ్మారెడ్డికివ్వాలి.

"ఏం నీదగ్గర లేవా అప్పుడు"

"ఉన్నా ఇవ్వకూడదు. కొలీగ్స్ దగ్గర తీసుకొని ఇస్తే వచ్చిందంతా పై ఆఫీసర్లకే పెడుతున్నాడని జాలిపడతారు."

"గొప్ప తెలివే! ఇంకోటెవరికి?"

"అది కమిషనర్‌కు"

"పుచ్చుకోడన్నావు"

"పుచ్చుకోడు. అలాగని ఇవ్వకుండా మానెయ్యకూడదు. ఇవ్వాలి. ఇచ్చినప్పుడల్లా రెఫ్యూజ్ చేస్తుంటాడు. వచ్చినప్పుడల్లా తను ఎంత నిజాయితీపరుడో ఓ లెక్చరిచ్చి సంతోషపడుతుంటాడు" అన్నాడు అమ్రుద్దీన్.

లెక్క పెడుతున్నామె షడెన్‌గా ఆగిపోయింది. బండిల్ నుండి కొన్ని నోట్లు బయటకు తీసింది. వాటిని నిశితంగా పరిశీలించి అవి దొంగనోట్లని చెప్పింది. అమ్రుద్దీన్ తల గిర్రున తిరిగింది. కల్తీ నిరోధించే ఉద్యోగం తనది. తనకిచ్చిన నోట్లలో కల్తీయా? అమ్రుద్దీన్ ముఖం చూసి ముంతాజ్‌కి నవ్వాగింది కాదు. పకపక నవ్వింది.

"ఆ నవ్వాపి డబ్బు బీరువాలో పెట్టు"

"ఇవీ?" దొంగ నోట్లని చూపిస్తూ అడిగింది.

"కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. సమయం చిక్కినప్పుడు కొడుకుల వీపు వాయిస్తా! దొంగనోట్లని చించి ఆ డ్రైనేజీలో పడెయ్!"

ముంతాజ్ కింకా నవ్వాగింది కాదు.

నవ్వుతూనే దొంగనోట్లని చించి మురికి కాలువలో పడేసింది. ●

స్వగతం

ఆత్మవిశ్వాసమే నా జీవనానికి ఉపాధి

చంద్రశేఖరరావు

కరీంనగర్ జిల్లాలోని పెద్దసముద్రాల మా స్వగ్రామం. పూచిక పుల్ల కూడా లేని నిరు పేద కుటుంబంలో జన్మించాను. భిక్షాటన మా జీవనాధారం. కూర్మాచలం కాంతమ్మ, విఠలయ్య లు నా తల్లిదండ్రులు. చిన్నతనంలోనే మా తండ్రిగారు స్వర్గస్థులవడం చేత భిక్షాటన భారం అమ్మ మోస్తూ నన్ను ఏడవ తరగతి వరకూ చదివించింది. ఆ తరువాత పై చదువుల నిమిత్తం హుస్నాబాద్‌లోని హాస్టల్‌లో చేర్పించింది. పదవతరగతి వరకు హుస్నాబాద్‌లోనే చదివాను. బోర్డుపరీక్షలు ఇంకో నెలరోజులు ఉంటాయనగా మా అమ్మ చనిపోవడంతో దిక్కులేని వాడినయ్యాను. గుండే దిటవుపరచుకొని పదవతరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణుడనయ్యాను. ఆ తరు వాత హాస్టల్‌నుంచి బయటకు పంపిం చేశారు. పై చదువులు చదివేశక్తి లేక బతుకుదెరువు లేక నడిరోడ్డున పడ్డాను. కడుపు నిండాతిండి, కంటినిండా నిద్రలేని రాత్రులను ఎన్నో గడిపాను. ఆ సమయంలో దయాసముద్రులు వెంకటనర్సయ్యగారు, శోభగారు ఆదరించి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు కంపెనీలో ఆఫీసు బాయ్‌గా ఉపాధి కల్పించారు. రోజుకు అయిదు రూపాయలు నా జీతం ఉండేది. దానిలో కొంత జీవనానికి, మరికొంత పుస్తకాలకు, ఫీజులకు వెచ్చించి బి.ఎ వరకు ప్రైవేటుగా ఉస్మానియా యూనివర్సిటీలో చదివాను. ఉద్యోగం చేస్తూనే చదువుకున్నాను. ప్రస్తుతం క్లర్కుగా పనిచేస్తున్నాను. ఉన్నంతలో తృప్తి పడుతూ జగద్గిరిగుట్టలో స్థిర నివాసం ఏర్పర్చుకున్నాను. నా జీవిత భాగస్వామి కూడా ఒక ప్రైవేటు విద్యాసంస్థలో టీచరుగా పనిచేస్తూ నాకు సహకరిస్తుంది. మాకు ఇద్దరు అమ్మాయిలు. తృప్తిగా కాలం గడిచిపోతోందని అనుకునేంతలో దురదృష్టం నన్ను వెంటాడుతూనే ఉంది. స్కూటర్ యాక్సిడెంట్‌లో తలకు బలమైన గాయం తగిలి కంటి చూపుపోయింది. అయినా కృంగిపోకుండా జీవన పోరాటం చేస్తూనే ఉన్నాను. కవిగా నేను చేసిన రచనలను బి.కిషన్ రావుగారు, నాగార్జున ప్రిన్స్‌పాల్‌గారు పరిశీలించి ఆదరించి శంఖారావమ్ పేరుతో వెయ్యి ప్రతులను ముద్రించి నన్నొక రచయితగా పదిమందికి పరిచయం చేశారు. దుర్భర జీవితానికి కారకులను నిందించుకుంటూ కూర్చునే కంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేసుకోవడం ఉత్తమ లక్షణం. దురదృష్టానికి సవాలుగా నిలిచి జీవితం అసంపూర్ణంగా గడిచిపోకుండా ఘనమైనదిగా, నిత్య చైతన్యవంతంగా మార్చుకోవాలి. అప్పుడే ఈ జీవితానికి సార్థకత చేకూరుతుందని నా నమ్మకం.

– కూర్మాచలం శంకరస్వామి,
జగద్గిరిగుట్ట, రంగారెడ్డి జిల్లా